# 'ఖిలమనగవు...'

ఎ.సువర్ణ

క్రిష్ణయ్య చనిపోయాడు... నమ్మలేకపోతున్నాను. అరవై ఏళ్ళు పైబడినా ఆయనను చూస్తే అంతవయసున్న వాడిలా కనిపించడు. యాభైకంటే ఎక్కువుండవనిపిస్తయ్యి... అలాంటి కట్టుమస్తాన దేహం. రోజూ యోగా వాకింగ్ చేసి దేహాన్ని ధారుడ్యంగా వుంచుకున్నాడు క్రిష్ణయ్య.

'ఆయన నా రెండో భర్త... ఆ... అవును నిజంగా...!''

పదహారేళ్ళు నిండకుండానే అమెరికాలో పేరు ప్రఖ్యాతులతో పాటు బాగా డబ్బు గడిస్తున్న డాక్టర్ రమణయ్యతో నా వివాహం జరిపించి అమెరికా పంపించారు నా తల్లిదండ్రులు... నా ఇష్టాష్టాలతో ప్రమేయం లేకుండా. ఒకవేళ నా ఇష్టాన్ని అడిగినా చెప్పలేని వయసు. అనకాపల్లి నుంచి ఒకేరోజులో అమెరికా వెళ్ళడం నుంచి నా పరిస్థితి అయోమయంగా వుంది.

రమణయ్యకు లేని అలవాటు లేదని శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళాకే తెలిసింది... సినిమాలలో చూపించినట్లు, నవలలో రాసినట్లు రమణయ్య స్త్రీ లోలుడు.

ఈ కాలం పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేసేందుకు అమెరికా వచ్చినట్లు వచ్చిన దాన్ని కాదు... కేవలం టెన్త్ క్లాసు పాసు అవగానే నన్ను పెళ్ళి చేసి పంపించేసేరు... వేరేదారి లేక నా భర్త చేసే అక్రమాలను సహిస్తూ, పెట్టే బాధలను భరిస్తూ అతనితోనే వుండి కాపురం వెలగబెట్టాను...

అతనితో చేసిన సంసార జీవితానికి ఫలితంగా మూడేళ్ళలో వెంట వెంటనే ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు.

ఇవన్నీ యాభై సంవత్సరాల తరువాత చెప్పుకుని ఏం ప్రయోజనం...? ఆలోచించగా ఆలోచించగా అది ఇంకెవరి జీవితంలానో అనిపిస్తుంది.

అన్నిరకాల లీలలను చేస్తూ స్వేచ్ఛగా ఇష్టంవచ్చిన తీరులో బతికిన రమణయ్య అల్పాయుష్కుడే యాభై ఏళ్ళు రాకుండానే కన్నుమూశాడు.

ఆ తరువాత ఎన్నో పోరాటాలు... అమెరికాలోనే సెటిలైన కొంతమంది స్నేహితులు, దూరపు బంధువుల సహాయ సహకారాలతో నర్సింగ్ కోర్సులో చేరి చదివి పూర్తి చేసి ట్రైనింగు అయి ఓ ఆస్పత్రిలో నర్సు ఉద్యో గంలో జాయిన్ అయ్యాను.

షిఫ్టులలో డ్యూటీ చేసి కష్టించి పనిచేసి హెడ్ నర్సుగా ప్రమోషన్ సంపాదించుకున్నాను.

కాలప్రవాహంలో నా కూతుళ్ళిద్దరు చదువుకుని తమకు నచ్చినవారిని ప్రేమించి వివాహమాడారు... సుఖసంతోషాలతో హాయిగా వున్నారు... కానీ...!

పిల్లలిద్దరూ వాళ్ళ దోవన వాళ్ళు వెళ్ళాక నా బతుకు శూన్యం అయిపోయింది... జీవిస్తున్నంతకాలం జీవిత భాగస్వామి అంటూ పక్క పంచుకునేందుకని కాకపోయినా, ఇంటికి రాగానే నవ్వుతూ కబుర్లు చెప్పడానికి, కలిసి వంట చేసుకు భోజనం చెయ్యడానికని ఓ తోడు నీడగా ఒకరుకావాలనిపించింది...

ప్రతీరోజూ ఏకాకి జీవితం గడపడం బ్రహ్మ ప్రళయంగా వుంది. ఇంటికి వస్తేనే ఒంటరితనం మహా బాధిస్తున్నది.

అలాంటి సమయంలోనే క్రిష్ణయ్య ఇంటర్‌నెట్ ద్వారా నాతో పరిచయం అయ్యాడు... ఫిజిక్స్ ప్రొఫెసరు. యూనివర్సిటీలో తనతో ఉద్యోగం చేసే కొలీగ్ అయిన అమెరికన్ అమ్మాయిని ప్రేమించి వివాహం చేసు కున్నాడు. ఇద్దరబ్బాయిలు పుట్టాక ఆమె క్యాన్సర్ వ్యాధితో మరణించింది. కొడుకులు

## ఎస్సెమ్మెస్‌లు (నానీలు)

మూడు ముళ్ళు
ఏడు అడుగులు
పెళ్ళంటే... నూరేళ్ళ
సహజీవన కావ్యం

పేదరికానికి
తలొంచిన పేగు బంధం
అమ్మకానికి
కడుపు పంట

పిడికెడు మెతుకులు
ఎంగిలి విస్తర్లు
పేదరికం
కుక్కలతో సహవాసం

యుద్ధంలో
గెలిచినా, ఓడినా
పుడమికి తప్పదు
పుత్ర శోకం

ఎర్రకణాలు
తెల్లకణాలు
విధ్వంస కణాలెక్కడివి
మనిషి రక్తంలో

*ఎస్.ఎం.సుభాని*

చదువుకుని పెరిగి పెద్ద వాళ్ళయి పెళ్ళిళ్ళు చేసుకుని జీవితాలలో సెటిలయ్యారు.

రిటైరు అయ్యాక భార్య భర్తలు విశ్రాంతిగా కాలం గడుపుదామనుకున్న వాళ్ళని భగవంతుడు చిన్నచూపు చూశాడు... లిసాని కృష్ణయ్య నుంచి వేరు చేసి తీసి కెళ్ళిపోయాడు.

కృష్ణయ్య అరవిందలు పరస్పరం పరిచయం చేసుకుని, ఒకరి అభిప్రాయాలు మరొకరికి చెప్పుకుని, కళ్ళు కళ్ళు కలిసి మాట్లాడుకున్నాక మా పెళ్ళికేవిధమై అభ్యంతరములేకపోయింది.

నాతో సరిసమానవయస్కుడైన ఈ కృష్ణయ్యతో నిండు జీవితం గడిపి జీవితాన్ని సార్థం చేసుకుని కన్ను మూయాలన్నదే నా కోరిక.

నేను ఎన్నో రకాల వంటలు రుచి రుచిగా చేస్తాను. కృష్ణయ్యకసలు వంటే రాదు... కానీ చేసిన వంటలకు వంకలు పెట్టకుండా లొట్టలేసుకుంటూ తిని వంట చాలా రుచిగా వుందని మెచ్చుకుంటాడు... పొగుడుతాడు.

మేమిద్దరము సుఖంగా జీవితం గడపడానికి ముఖ్యంగా కావాల్సింది బ్యాంక్ బ్యాలెన్సు... అది తృప్తికరంగానే వుంది.

నచ్చో, నచ్చకనో, మా పిల్లలు మా సంబంధాన్ని అంగీకరించే తీరాల్సి వచ్చింది... కాలక్రమేణా ఈ బంధం వలన ఎవరూ బాధింపపడలేదు... వారి వారి ఊళ్ళలో వాళ్ళ వాళ్ళ ఉద్యోగాలలో వాళ్ళంతా మహా బిజీ.

మా జీవితాలను మేమే చూసుకోవాలి...!

కృష్ణయ్యతో గడిపిన పది సంవత్సరాల జీవితం ఎంతో మధురంగా గడిచిపోయింది. రోజులు పోయిందే తెలీలేదు... నేను నా భర్తలో ఏ లక్షణాలు వుండాలనుకున్నానో ఆ లక్షణాలన్నీ ఆయనలో వున్నయ్యి.

నేను నోరు విప్పానంటే దొణ దొణమని వాగేస్తాను. నేను మాట్లాడేవన్నీ ఆయనెంతో ఓర్పుగా వింటారు... అతను ఎన్నో విషయాలు మాట్లాడతారు కానీ నాకు మల్లే ఉద్రేకపడడు.

నేను నా ఆస్పత్రిలో ఉద్యోగం మానలేదు. కంటిన్యూ చేశాను... ఆయన ఇంట్లోనే వుండి తోటపని చేసి ఇంట్లోనే కూరగాయలు, పళ్ళు పండించారు.. పూలు పూయించారు... ఇంట్లో ఆనందమయమైన వాతావరణాన్ని సృష్టించారు... కాలాన్ని ప్రపంచ పటంలోని కొత్త కొత్త ప్రదేశాలను వెతికి పట్టుకుని వెళ్ళి చూసి రసించి వస్తాము... జీవితాన్ని పూర్తిగా రసించి అనుభవించగల రసికులు.

మా మధ్య పర్‌ఫెక్ట్ అండర్‌స్టాండింగ్ వుంది... ఇద్దరి మధ్య రహస్యాలనేవి లేకుండా ఇద్దరం మనసులు విప్పి మాట్లాడుకున్నాము.

డబ్బు విషయానికొస్తే తనకి ఆస్తి పాస్తులేమీ లేవు... ఏదో సుఖంగా బతకడానికి చాలినంత డబ్బు మాత్రమే వుందనిచెప్పారు. నాతో చాలాసార్లు...!

నేనాయన ఆస్తిపాస్తులకు ఆశపడి వివాహం చేసుకోలేదు కనక ఆయన చెప్పింది ఈ చెవితో విని ఆ చెవితో వదిలేశాను.

ఏమాత్రం అనుకోని వార్త కృష్ణయ్య చావు పిడుగులా నా నెత్తిన పడింది. మెరుపులా నా హృదయాన్ని తాకింది.

ఫ్రాంక్‌ఫర్ట్‌లో తమ్ముని ంటికి వెళ్ళినాయన అక్కడ

టైఫాయిడ్ జ్వరం వచ్చి ఆస్పత్రిలో చేరాడు కృష్ణయ్య... అక్కడే ఆయన ఆఖరి శ్వాస వదిలారు... విషయం తెలిసిన వెంటనే ఫ్లైట్ పట్టుకు ఫ్రాంక్‌ఫర్డ్ వెళ్ళాను.

ఆయన ఇద్దరు కుమారులు అప్పటికే వచ్చున్నారు. బాగా వున్నవారే...! ఆస్పత్రికి బిల్లుకట్టాలనేసరికీ ఇద్దరూ నన్ను చూపించి వాళ్ళు పక్కకు తప్పుకున్నారు.

'పెళ్ళి చేసుకుని ఇన్నాళ్ళు సహజీవనం గడిపినందు కాయనకు ఈ మాత్రం ఖర్చు కూడా చెయ్యలేనా...? అనుకుని నేను దాచుకున్న సేవింగ్స్‌లోంచి ఆయన ఆస్పత్రికైన బిల్లంతా చెల్లించాను... ఆయనకు అంత్య క్రియలు చెయ్యాలి... అందుకు నా పర్సే తెరవాల్సి వచ్చింది.

చనిపోయిన కృష్ణయ్య మొహంలో ఓ కపటమైన నవ్వు తారాడడం గమనించాను... అది చూసిన నేనలాగే స్తంభించిపోయాను. అందరూ ముక్కున వేలేసుకుని ఆశ్చర్యంగా ఆ నగుమోముని చూశారు.

''ఆహా...! ఏం దైవీకమైన ప్రశాంతమైన చిరునవ్వు...? వచ్చి చూసిన అందరూ పొగిడారు.

''దాపరికాలు అనేవి లేకుండా... అన్నీ బయటకు చెప్పయ్యగలిగిన నిజాయితీపరులే ఇలా చిరునవ్వులు చిందించగలరు మరణించాక కూడా...!'' అని కొంతమంది అనడం కూడా విన్నాను.

తన కొడుకుల పేరున వీలునామా రాసి పెట్టి పోయారు...ఆ వీలునామాను తీసుకొచ్చి చూపించారు...

నేను నమ్మలేకపోయాను.

ఎంత ఆస్తి ఆయన పేరున వుంది...? రెండు పెద్ద పెద్ద బంగాళాలు... రెండు చోట్ల ఏనాడో కొనిపడేసిన సైట్లు... ప్రోపర్టీ మొత్తం విలువ కొన్ని మిలియన్ డాలర్లు...!

నేను అడగకపోయినా తనకేవిధమైన ప్రోపర్టీ లేదని చెప్పారే... ఈ పదిసంవత్సరాలలో ఎన్నోసార్లు.

ఇంత ప్రేమగానూ, అన్యోన్యంగానూ వుండి, ఇంత ప్రోపర్టీని వుంచుకుని, నాతో ఏంలేదని ఎందుకు అబద్ధాలు చెప్పినట్లు...?

ఎందుకని కృష్ణయ్యా... ఎందుకు...?

మెల్లగా బయటపడిన ఆ చేదునిజం నాకు చేదునే మిగిల్చింది. మళ్ళీ నేను మోసగింపబడ్డాను.

ఇదివరకో రమణయ్య...ఇప్పుడో కృష్ణయ్య... వీళ్ళలో కృష్ణయ్యే గజదొంగగా విశ్వరూపం ఎత్తి నా కళ్ళముందు కనిపిస్తున్నాడు. నా పరిపూర్ణమైన ప్రేమను పొంది నన్నో ఫూల్‌ని చేసిపోయాడు.

మళ్ళీ కృష్ణయ్య మొహంలోని ఆఖరి చిరునవ్వు కళ్ళముందుకు తెచ్చుకుని పరీక్షగా చూశాను.

హఠాత్తుగా నా తలమీద సుత్తిదెబ్బ పడ్డట్లు కళ్ళు బైర్లు కమ్మినయ్యి.

ఆ నర్మగర్భమైన చిరునవ్వులోని అర్థం...?

మంచివాడిలాగా చక్కగా నటించి నిన్నెలా మోసం చేసి బుట్టలో వేసుకున్నానో చూశావా... అంటూ...

నాకు మాత్రమే కృష్ణయ్య కపట నవ్వులోని కపటం అర్థం అయ్యింది. ■

## వాన కురుస్తోంది

నింగికి
నీలిరంగు
వేస్తున్నాయి
మేఘాలు
నాకు ఆ రంగు
వద్దంటూ ఆ ఆకాశం
చెరిపివేసుకుంటోంది
అందుకే వాన కురుస్తోంది

ఆత్రం శశికిరణ్

## ఒరవడి-పరవడి

'ఈ' జీవితం
అనుభవాల
ఒరవడి
అనుభూతల
పరవడి
నేర్పుతుంది
'మనిషికి'
'నవ్వడం'
ఏడ్వడం
'చల్లగా' బుగ్గలపై
జారుతూ
వేడిగా గుండెలపై
కన్నీరై పారుతూ

రాఘవరావు